## రేపు లోక్ అదాలత్

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి**

రంగారెడ్డి, డిసెంబర్ 12 (నమస్తే తెలంగాణ) : జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్‌వారి ఆదేశాల మేరకు ఈ నెల 14న రంగారెడ్డిజిల్లాలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించటం జరుగుతుందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు ముందుకు రాని కేసులు, కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకునేందుకు వేదిక ఈ లోక్ అదాలత్ అని తెలిపారు. లోక్ అదాలత్‌లో కేసు దాఖలు చేసినప్పుడు కోర్టు రుసుము చెల్లించాల్సిన అవసరంలేదు. న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉన్న సివిల్ కేసు, లోక్ అదాలత్‌కు పంపబడి, తర్వాత పరిష్కరించబడినట్లయితే వాస్తవానికి కోర్టులో చెల్లించిన కోర్టు రుసుము కూడా పార్టీలకు తిరిగి చెల్లించబడుతుంది. లోక్ అదాలత్‌లో కేసు పరిష్కరించుకుంటే ఇరు వర్గాలు గెలిచినట్లే.. ఈ లోక్ అదాలత్‌ల ద్వారా సమయం, డబ్బు వృథా కాకుండా ఉంటుంది. రాజీకి వీలున్న క్రిమినల్, సివిల్, కుటుంబ తగాదాలు, డబ్బు రికవరీ, మోటర్ వెహికిల్ యాక్సిడెంట్, చిట్‌ఫండ్, ఎలక్ట్రిసిటీ, చెక్కు బౌన్స్, తదితర కేసులను సులభంగా పరిష్కరించుకోవచ్చునని, ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రక్రియ పరిశీలన

**కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో పర్యటించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**

కొడంగల్, డిసెంబర్ 12 : ఇందిరమ్మ ఇండ్ల పథకానికి అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు వీలుగా నిర్వహిస్తున్న మొబైల్ యాప్ సర్వే ప్రక్రియను వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆకస్మికంగా పర్యటించి తనిఖీ నిర్వహించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 8వ వార్డులో ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల మొబైల్ యాప్ సర్వే ద్వారా ఆన్‌లైన్ నమోదు విధానాన్ని పరిశీలించి నేరుగా లబ్ధిదారులతో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. సొంత ఇల్లు ఉందా.. ప్రస్తుతం నివాసం ఉంటున్నారా.. పాత పెంకుటిల్లా, పక్కా గృహమా, స్థలానికి సంబంధించి ధ్రువ పత్రాలు ఉన్నాయా వంటి తదితర వివరాలను



కొడంగల్‌లో లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

యాప్‌లో సిబ్బంది ద్వారా నమోదు చేయించారు. ఒక్కో దరఖాస్తుడికి సంబంధించి నమోదు ప్రక్రియ ఎంత సమయం పడుతుంది, రోజుకు సగటున ఎంత మంది లబ్ధిదారుల వివరాలను నమోదు చేస్తున్నారు, ఇప్పటివరకు ఎంత మంది వివరాలను సేకరించారు, ఆన్‌లైన్‌లో ఎంత మంది వివరాలను నమోదు చేశారు అనే అంశాలపై సిబ్బందితో ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలను విధిగా పాటిస్తూ.. ఎటువంటి తప్పిదాలకు తావులేకుండా వివరాలను సేకరించి నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. పాత ఇంట్లో నివాసముంటున్నవారు ఆ స్థలంలో కొత్త ఇంటిని నిర్మించుకోవాలనుకునే వారి వివరాలను యాప్‌లో పొందుపరచాలని తెలిపారు. అర్హత గల లబ్ధిదారులకు ప్రభుత్వపరంగా లబ్ధి చేకూరేలా అన్నింటా జాగ్రత్తలు పాటించి వివరాలను యాప్‌లో నమోదు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## వివరాలు సక్రమంగా నమోదు చేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

వికారాబాద్, డిసెంబర్ 12 : ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. గురువారం వికారాబాద్ సమీకృత కార్యాలయ సమావేశం హాలులో సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాపాలన సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల కోసం లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించడం జరిగిందని, జిల్లాలో గ్రామీణ ప్రాంతంలో, పట్టణ ప్రాంతంలో వచ్చిన దరఖాస్తులను మొబైల్ యాప్ ద్వారా అప్లోడ్ చేసే కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించాలన్నారు. ఈ దరఖాస్తులన్నింటినీ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన ఇందిరమ్మ ఇండ్ల ఇన్‌స్పెక్షన్ మొబైల్ యాప్ ద్వారా గ్రామపంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులు పరిశీలించాలని తెలిపారు. జిల్లాలోని గ్రామపంచాయతీలు, వార్డు పరిధుల్లో పంచాయతీ సెక్రటరీలు, వార్డు ఆఫీసర్లు ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన కార్యక్రమాన్ని పూర్తిచేయాలన్నారు. దరఖాస్తుదారు బీపీఎల్ కార్డు వర్గం, ప్రస్తుత నివాస గృహానికి సంబంధించిన పూర్తి వివరాలు, కులం, చిరునామా, అన్ని వివరాలతో పాటు, ప్రస్తుతమున్న ఇంటి దగ్గర తీసుకున్న ఫొటో, ఇంటి పరిస్థితిపై లోపల, బయట ఫొటోలు, కొత్తగా నిర్మించతలపెట్టిన స్థలం, దానికి సంబంధించిన పూర్తి వివరాలను మొబైల్ యాప్‌లో అప్లోడ్ చేసే విధానంపై అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్, పంచాయతీ అధికారి జయసుధ, గ్రామపంచాయతీ కార్యదర్శులున్నారు.

## నేడు సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు నిలిపివేత

వికారాబాద్, డిసెంబర్ 12 : వికారాబాద్ జిల్లాలోని కాటన్ మిల్లుల్లో స్టాక్స్ ఎక్కువ ఉన్నందున శుక్రవారం సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు నిలిపివేస్తున్నట్లు జిల్లా మార్కెటింగ్ అధికారి సారంగపాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు రైతు సోదరులు సమీప ఇతర పత్తి మిల్లుల్లో తమ పత్తిని విక్రయించుకోవాలని కోరారు. శుక్రవారం వికారాబాద్ ధరణి కాటన్ మిల్, శ్రీ సాయి బాబా ఆగ్రో టెక్, అయ్యప్ప కాటన్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్, పరిగిలోని రాకంచెర్ల కాటన్ మిల్, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర ఇండస్ట్రీస్, మర్పల్లిలోని అయ్యప్ప కాటన్ ఇండస్ట్రీస్, ధారూరు శ్రీ సాయిబాబా ఆగ్రో కామడిటిస్, కోట్‌పల్లిలోని మంగళం గిన్నేర్స్‌లను మూసివేస్తున్నట్లు తెలిపారు.

# పండుగలా నిర్వహించాలి

**డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు కార్యక్రమం**

- జిల్లాలో 57 రెసిడెన్షియల్, 99 సంక్షేమ హాస్టళ్లలో ఏర్పాట్లు చేయాలి
- రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి
- కలెక్టరేట్‌లో జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష

ఆదిబట్ల, డిసెంబర్ 12 : తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సంక్షేమ గృహాలు, పాఠశాలల్లో డైట్, కాస్మోటిక్ చార్జీల పెంపు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో జూమ్ మీటింగ్ ద్వారా సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల డైట్ చార్జీలను 40 శాతం పెంచిందని, ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఈ నెల 14న జిల్లాలోగల 57 రెసిడెన్షియల్ పాఠశాలలు, 99 సంక్షేమ హాస్టళ్లలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని.. అందుకు అధికారులు తగిన ఏర్పాట్లు ముందుగానే చేయాలని తెలిపారు. ఆర్డీవోలు, జిల్లా పంచాయతీ, జిల్లాస్థాయి స్పెషల్ అధికారులు తమ పరిధిలోని సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో పారిశుధ్య కార్యక్రమాలను పర్యవేక్షించాలన్నారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల పరిసరాలు, తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం ఉండేలా హాస్టల్ వార్డెన్లు, పాఠశాల ప్రిన్సిపాల్స్, అధికారులు చర్యలు చేపట్టాలన్నారు.

ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజాప్రతినిధులను ఆహ్వానించాలని.. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలల విద్యార్థుల తల్లిదండ్రులు కూడా కలిసి భోజనం చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ఇందుకనుగుణంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆహ్వానం పంపాలన్నారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు డైట్ చార్జీల పెంపు కార్యక్రమం జరగాలని, తదుపరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పని చేసి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంబంధిత అధికారులు ఈ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని ఆదేశించారు. సమీక్షా సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, ఎంపీడీవోలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

**ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలి**

ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల పరిశీలన ఈ నెల చివరి వరకు పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. మొదటి దశలో సొంత స్థలం కలిగి ఉన్నవారిని, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నవారిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ప్రజాపాలనలో జిల్లాలో 3,75,1300 దరఖాస్తులు వచ్చాయన్నారు. పంచాయతీ కార్యదర్శి, వార్డు అధికారితో పాటు ఇతర అధికారులను కూడా నియమించడం జరిగిందని, ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తులను పరిశీలన కార్యక్రమాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజక



వర్గానికి 3500 ఇండ్లను నిర్మించడం జరుగుతుందని తెలిపారు. ఈ ఇండ్ల నిర్మాణానికి బేస్మెంట్ స్థాయిలో కొంత, రూఫ్ లెవల్‌లో కొంత మొత్తంగా ప్రతి ఒక్క ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల ఆర్థిక సహాయం అందజేయడం జరుగుతుందని తెలిపారు. స్థలం లేని నిరుపేదలకు కూడా రెండో దశలో ఇండ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తుందని తెలిపారు. మండల స్థాయి నుంచి ఇద్దరు చొప్పున ఎంపిక చేసి మాస్టర్ ట్రైనర్లతో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, ప్రభుత్వ మార్గదర్శకాలను తూచా తప్పకుండా పాటిస్తూ, తప్పిదాలకు తావు లేకుండా వివరాలను సేకరిస్తూ ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. సర్వే నమోదులో ఎలాంటి సమస్యలు ఎదురైనా మండలంలో, మున్సిపాలిటీలో కంట్రోల్ రూంలను, అదేవిధంగా కలెక్టరేట్‌లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకు టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా సందేహాలను నివృత్తి చేస్తారన్నారు. ఈ నెల 16 నుంచి క్షేత్ర స్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో గ్రూప్ 2 పరీక్షల నిర్వహణలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ముందుగానే కేంద్రాలకు వెళ్లి ఏర్పాట్లను చూడాలన్నారు. రూట్ ఆఫీసర్లు, పోలీస్ నోడల్ అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో పాటు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఓయూ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 12 : ఉస్మానియా యూనివర్సిటీ ఫ్యాకల్టీ ఆఫ్ ఎడ్యుకేషన్ డీన్‌గా ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయనకు ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ నియామక పత్రం అందజేశారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగానికి చెందిన ఆయన ఇంతకుముందు పాలమూరు యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్‌గా సేవలందించారు. ఆయన గతంలో ఓయూ ఫిజికల్ డైరెక్టర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం హెడ్, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, ఐయూటీ సెక్రెటరీ, నిజాం కళాశాల ప్రిన్సిపాల్ తదితర బాధ్యతలు నిర్వర్తించారు. ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా)లో క్రియాశీలకంగా పనిచేయడంతోపాటు కార్యవర్గంలో వివిధ పదవులకు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను అధ్యాపకులు, అధికారులు, విద్యార్థి నాయకులు అభినందించారు.

## 19 నుంచి రాష్ట్రస్థాయి పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న మల్టీ జోనల్ అధికారి రజని

షాద్‌నగర్‌రూరల్, డిసెంబర్ 12 : ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ నెల 19 నుంచి రాష్ట్రస్థాయిలో ఆటల పోటీలను నిర్వహించనున్నట్లు గురుకుల మల్టీ జోనల్ అధికారి రజని తెలిపారు. పాఠశాల ప్రిన్సిపాల్ విద్యుల్లత ఆధ్వర్యంలో కమ్మదనం గురుకులంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, వ్యాయామ ఉపాధ్యాయులతో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, గురుకుల పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాల్ వర్షిని ఆదేశాల మేరకు రాష్ట్ర స్థాయిలో క్రీడా పోటీలను కమ్మదనం గురుకులంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 1200 మంది విద్యార్థులు పాల్గొంటారన్నారు. వారందరికీ అన్ని వసతులు సమకూర్చనున్నట్లు తెలిపారు. పోటీలను విజయవంతం చేయాలని ప్రిన్సిపాల్స్, పీడీ పీటీలను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో గురుకులాల రాష్ట్ర స్థాయి అధికారి భీమయ్య, జోనల్ అధికారి ఫ్లోరెన్స్ రాణి సిక్స్, జోన్ అధికారి నిర్మల పాల్గొన్నారు.

## ఎస్ఎస్ఏ ఉద్యోగుల డిమాండ్‌లను నెరవేర్చాలి



ఎస్ఎస్ఏ ఉద్యోగుల రిలే దీక్షకు మద్దతు తెలుపుతున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 12 : సమగ్ర శిక్షా ఉద్యోగుల (ఎస్ఎస్ఏ) సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కన్వీనర్ రవీందర్ తెలిపారు. గురువారం వికారాబాద్‌లోని ఆర్డీవో కార్యాలయం వద్ద చేపట్టిన ఎస్ఎస్ఏ రిలే నిరాహార దీక్షకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రవీందర్ మాట్లాడుతూ.. సమగ్ర శిక్షా ఉద్యోగుల డిమాండ్లు రాజ్యాంగబద్ధమైనవని, ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2023 సెప్టెంబర్ నెలలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలన్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులను రెగ్యులర్ చేసి, వారికి ఉద్యోగ భద్రతను, ఆరోగ్య భద్రతను కల్పించాలని డిమాండ్ చేశారు. పనికి తగ్గ వేతనాలు కల్పించాలని, ఉద్యోగులు సమస్య పరిష్కారం కోసం ఎల్లప్పుడూ ధర్మ సమాజ్ పార్టీ మద్దతు ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ జిల్లా కో కన్వీనర్ మల్లికార్జున్, నాయకులున్నారు.

## హస్నాబాద్ విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపిక

**విద్యార్థినిని అభినందించిన ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు**



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కొడంగల్, డిసెంబర్ 12ః తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయి పోటీలు జరిగాయి. జిల్లా పరిధిలోని 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు గణితంలో ప్రావీణ్యాన్ని పెంపొందించే దిశగా ప్రత్యేకంగా పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొడంగల్ నియోజకవర్గంలోని దుద్యాల మండలం హస్నాబాద్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎం.రితిష (10వ తరగతి) జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. జిల్లా పరిధిలోని పాఠశాలలకు సంబంధించి మొత్తంగా 60 మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరు కాగా అందులో హస్నాబాద్ విద్యార్థిని తెలుగు మాధ్యమంలో ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. దీంతో శుక్రవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని ఉపాధ్యాయులతోపాటు తోటి విద్యార్థులు ఘనంగా సన్మానించి ప్రత్యేకంగా అభినందించారు.

# అలరించిన బాల వైజ్ఞానిక ప్రదర్శన

- దైనందిన జీవితంలో ప్రతి సన్నివేశాన్ని పరిశీలించాలి
- ట్రైనీ కలెక్టర్ ఉమా హారతి

వికారాబాద్, డిసెంబర్ 12 : దైనందిన జీవితంలో ప్రతి సన్నివేశాన్ని పరిశీలించి ఎందుకలా అని ప్రశ్నించి, వాటికి సమాధానాలు కనుక్కోవడమే సైన్స్ అని జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి తెలిపారు. గురువారం వికారాబాద్‌లోని కొత్తగడి తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో జరిగిన జిల్లాస్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ అవార్డు ప్రదర్శన 2023-24ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వికారాబాద్ జిల్లా ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే శాస్త్రీయ దృక్పథం, పరిశీలన వైఖరిని అలవరచుకోవాలని, భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలను తిలకించి విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి రేణుకాదేవి మాట్లాడుతూ.. మనిషి జీవితంలో ప్రతి క్షణం సైన్స్‌తో ముడిపడి ఉందన్నారు. వేదకాలం నుంచి జరిగిన అనేక విషయాలను సైన్స్ ద్వారా అవగాహన చేసుకోవాలన్నారు. పరమేశ్వరుడు తన కంఠంలో హాలాహలాన్ని దాచుకొని ఈ సృష్టిని కాపాడే ప్రయత్నం చేశాడని, అది ప్రకృతిని కాపాడే శక్తి అని అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ సాయిలత మాట్లాడుతూ.. ఇక్కడికి వచ్చిన ప్రతిఒక్కరూ కొత్త విషయాలను నేర్చుకోవాలని సూచించారు. జిల్లా సైన్స్ అధికారి విశ్వేశ్వర్ మాట్లాడుతూ.. సైన్స్ అనే మూలస్తంభంపై ఈ ప్రపంచం ఆధారపడి ఉందన్నారు.

జిల్లాలో జరిగిన వివిధ సైన్స్ కార్యక్రమాలపై నివేదిక సమర్పించారు. ఈ సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఇన్‌స్పైర్ నుంచి 55 ప్రదర్శనలు, జిల్లా సైన్స్ ప్రదర్శనలో 398 ప్రదర్శనలు నమోదయ్యాయి. న్యాయ నిర్ణేతలు సైన్స్ ప్రదర్శనలు పరిశీలించి ప్రారంభించారు. ఈ సైన్స్ ఫేర్ కార్యక్రమం రెండు రోజులు కొనసాగనున్నది. కార్యక్రమంలో మండల విద్యాధికారి బాబూసింగ్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



సైన్స్‌ఫేర్‌లో ట్రైనీ కలెక్టర్‌కు ప్రయోగాలను వివరిస్తున్న ఓ విద్యార్థిని

### నడకతో విద్యుత్ తయారు

ప్రస్తుత సమాజంలో మానవుడికి విద్యుత్ అత్యంత కీలమైనదని, దీని కోసం నడకతో విద్యుత్ తయారు చేసే యంత్రాన్ని చౌడాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాల 9వతరగతి విద్యార్థి సురేశ్ ఉపాధ్యాయుని సహాయంతో తయారు చేశాడు. శిలాజ ఇంధనాలు బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువు వంటి వాటిని ప్రస్తుతం మనం అవసరానికి మించి ఉపయోగిస్తున్నామన్నారు. ఇవి అయిపోతే అవి తిరిగి ఏర్పడవు.. ఇవి లేకపోతే విద్యుత్ ఉండదన్నారు. అందుకనే అతి తక్కువ ధరతో నడకతో విద్యుత్ తయారు చేసే పరికరాన్ని కనుగొన్నామన్నారు. అదే ఫూట్ స్టెప్ పవర్ జనరేషన్. బస్ స్టేషన్, రైల్వే స్టేషన్, షాపింగ్ మాల్స్, ఎయిర్‌పోర్ట్స్, పార్కులు, నడక ప్రదేశాల్లో దీనిని అమర్చాలన్నారు. నడక వల్ల ఏర్పడిన యాంత్రిక శక్తిని విద్యుత్ శక్తిగా మారుస్తుందని తెలిపారు. ఇది తక్కువ ఖర్చుతో సులువుగా ప్రపంచం అంతటికీ ఎలాంటి ఇంధనం అవసరం లేకుండా విద్యుత్‌ను తయారు చేస్తుందన్నారు. ఈ ప్రయోగాన్ని చూసిన పలువురు ఆ విద్యార్థినిని అభినందించారు.



నడకతో విద్యుత్ తయారీ యంత్రం చూపుతున్న విద్యార్థి

## ఎకో టూరిజంకు అనువుగా బొంరాస్‌పేట రిజర్వ్ ఫారెస్టు

**చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చార్మినార్ సర్కిల్ ప్రియాంక వర్గీస్**

కొడంగల్, డిసెంబర్ 12 : బొంరాస్‌పేట రిజర్వ్ ఫారెస్టు ప్రాంతం అర్బన్ పార్క్, ఎకో టూరిజం అభివృద్ధికి అనువుగా ఉందని.. వెంటనే ప్రతిపాదనలు తయారు చేయాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చార్మినార్ సర్కిల్ ప్రియాంక వర్గీస్ పేర్కొన్నారు. శుక్రవారం నియోజకవర్గ పరిధిలోని బొంరాస్‌పేట, అప్పాయిపల్లి రిజర్వ్ ఫారెస్ట్‌లు, కొత్తూర్ సెంట్రల్ నర్సరీలను సందర్శించారు. అటవీ ప్రాంతంలో అర్బన్ పార్క్ అభివృద్ధితో పాటు పక్కనే ఉన్న బొంరాస్‌పేట చెరువులో వాటర్ స్పోర్ట్స్ ప్రతిపాదనలు కూడా అవసరమని అధికారులకు సూచించారు. కొత్తూర్ సెంట్రల్ నర్సరీని సందర్శించి నర్సరీలో రాబోవు వర్షాకాలానికి చందనం మొక్కలను పెంచి రైతులకు అందించేలా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. కొత్తూరు ప్రజలకు ఉపయోగపడే మొక్కలను పెంచడానికి చర్యలు తీసుకోవాలని, నర్సరీ స్థాయిని మరింతగా పెంచాలని సూచించారు. రోడ్డుకు ఇరువైపులా నాటిని మొక్కలను జాగ్రత్తగా సంరక్షించాలని, రోడ్డుకు ఇరువైపులా మరింత అందాన్ని పెంచేలా మొక్కల పెంపకం చేపట్టాలని హెచ్ఎండీఏ అధికారులకు సూచించారు. అప్పాయిపల్లి రిజర్వ్ ఫారెస్టులోని ప్లాంటేషన్‌ను పరిశీలించారు. సరైన ఎత్తులో ఉన్న మొక్కలను నాటాలని అధికారులను ఆదేశించారు. అనంతరం కడా కార్యాలయంలో కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, జిల్లా డీఎఫ్‌వో జ్ఞానేశ్వర్, మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్‌తోపాటు ఇతర సిబ్బందితో సమావేశమై కొడంగల్‌లోని అటవీ శాఖ అభివృద్ధి పనుల గురించి చర్చించారు. కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ అధికారులు సవిత, శ్యాంకుమార్, సెక్షన్, బీట్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.



అటవీ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్, చార్మినార్ సర్కిల్ ప్రియాంక వర్గీస్

## ఎంఎంఎస్ పరీక్షా తేదీలు ఖరారు

ఓయూ, డిసెంబర్ 12 : ఓయూ పరిధిలోని మాస్టర్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ (ఎంఎంఎస్) కోర్సు పరీక్షా తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎంఎస్ రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షా తేదీల వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

## గడువులోగా వ్యవసాయ గణన పూర్తిచేయాలి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**

వికారాబాద్, డిసెంబర్ 12 : ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా వ్యవసాయ గణన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో 11వ ప్రపంచ వ్యవసాయ గణనపై రెండో దఫాగా క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా పరిధిలోని రెవెన్యూ గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని సర్వే నంబర్లవారీగా పంట సాగు వివరాలను సేకరించాలన్నారు. నీటి పారుదల, రైతు సామాజిక, ఆర్థిక స్థితిగతులు, రుణాల సేకరణ రైతులు వ్యవసాయ శాఖలో అనుసరిస్తున్న వివిధ పద్ధతులు, ఎరువులు, పురుగు మందుల వినియోగం తదితర వివరాలను మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ గణన ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని, ఎలాంటి పొరపాటు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సీపీవో అశోక్, వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారులు, విస్తరణ అధికారులు, ప్లానింగ్ స్టాటికల్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన అధికారులు

## ఓయూలో భూగర్భ శాస్త్రవేత్తల జాతీయ సదస్సు



సదస్సు సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

ఉస్మానియా యూనివర్సిటీ, డిసెంబర్ 12: ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై భౌగోళిక అన్వేషణ గణనీయమైన ప్రభావం చూపుతుందని కేంద్ర సముద్ర అభివృద్ధి శాఖ మాజీ కార్యదర్శి, ఎన్‌జీఆర్ఐ మాజీ డైరెక్టర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత ప్రొఫెసర్ హర్ష్ గుప్తా అన్నారు. ఆర్థిక వృద్ధిలో కీలకమైన లోహాలు, విలువైన ఖనిజాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ ఎక్స్‌ప్లొరేషన్ జియోఫిజిసిస్ట్స్ (ఏఈజీ) స్వర్ణోత్సవాల సందర్భంగా 46వ వార్షిక సమ్మేళనం నిర్వహించారు. ఇందులో భాగంగా ఓయూ జియోఫిజిక్స్ విభాగంలో 'జియో ఎక్స్‌ప్లొరేషన్ ఫర్ క్రిటికల్ మినరల్స్ అండ్ ప్రీషియస్ మెటల్స్'పై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ఏఈజీ ఉపాధ్యక్షుడు, జియోఫిజిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ వీరయ్య అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ప్రొఫెసర్ హర్ష్ గుప్తా హాజరయ్యారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కరుణాసాగర్, ఓఎన్జీసీ బేసిన్ మేనేజర్ కరవణ్ణన్, జీఎస్ఐ మాజీ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ రామమూర్తి, ఏఈజీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కార్యదర్శి డాక్టర్ నరసింహారావు, సంయుక్త కార్యదర్శి బాబు, కోశాధికారి జవహర్, సహాయ కార్యదర్శులు అల్లిపీర, డాక్టర్ ఎంఎన్ చారి పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం

తెలుగు యూనివర్సిటీ, డిసెంబర్ 12. సుప్రసిద్ధమైన నరసింహ శతక కర్త శేషప్ప కవి జీవితం, సాహిత్యంపై వ్యాసరచన పోటీలను నిర్వహించనున్నట్లు తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ చెన్నయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 35 సంవత్సరాల్లోపు యువతీ యువకులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. సొంత రచన అని తెలియజేస్తూ స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేయాలని సూచించారు. జనవరి 20 లోగా తెలంగాణ సారస్వత పరిషత్, తిలక్‌రోడ్డు, అబిడ్స్, హైదరాబాద్-1 చిరునామాకు పంపించాలని కోరారు. తెలుగు కవిత్వ రచనలో మెళకువలు నేర్పించే సంకల్పంతో తెలంగాణ సారస్వత పరిషత్ ఈ నెల17న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెన్నయ్య వెల్లడించారు. పాల్గొనేవారు 9603727234నంబర్ వాట్సాప్‌లో తమ పేరు నమోదు చేసుకోవాలని సూచించారు.